క్లబ్బు

శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మిగారు

"మీరు దూరాలోచన చెయ్యండి. మీ బుద్ధిని తీక్ష్ణంగా వుపయోగించి జరగబోయే పరిస్థితులను గమనించండి. పాశ్చాత్యదేశ స్త్రీలల్లా, మనదేశ స్త్రీలూ, మనదేశపు ఆచారములూ, మనసంఘమూ ఒప్పదు. చెప్పవలసినది మరిచిపోయా, అన్నీ యెలావున్నా ముందు మనదేశపు పురుషస్వభావం ఒప్పదు." అంది సీత.

"సీతా! ఆ స్త్రమానం వితండవాదమే నాకెప్పుడూ ఒకటేపద్ధతా, మనకుమాత్రం నాగరికత అక్కరలేదా, చూడు; ఆదేశంలో పురుషులూ, స్త్రీలూ ఏవిధం అయిన ఎరమరికా లేకుండా కలిసి మెలిసి వుంటారు. అచటి స్త్రీలకు కావలసినంత స్వేచ్ఛ; స్త్రీ యిష్టం స్త్రీ మీదనే ఆధారపడివుంటుంది. ఆమె ఏమిచేసినా సరే..." అని రామారావు చెప్పబోతూంటే సీత తటాలున తనప్రసంగం మొదలుపెట్టింది.

"ఆగండి! ఆమెకు స్వేచ్ఛ ఎక్కువఅంటే ఆ పురుషుని విశాలహృదయాన్నీ, ఉదారతనీ కొనియాడవలసివుంది. అయితే మనసంఘం స్త్రీలపాలిటి మరణశృంఖలం. మనదేశపు పురుషులు కుంచిత హృదయులు, అనుమానపూరితులు; సహనంఅనేది వారికి లేనేలేదు." అంది సీత నిశ్శంకగా.

"అయితే నువ్వు క్లబ్బుకు వస్తావా రావా? అబ్బా! నిన్ను ఒప్పించేసరికి నాప్రాణంపోతోంది. మన స్త్రీలను పైకి తీసుకువద్దామన్నా రారే! అందుకనే మేమోకన్య మనలను మూషచక్రవర్తులనీ, బానిసలనీ ఎత్తిరాసింది."

"మీ రెన్నన్నా సరే; నేనుమాత్రం క్లబ్బుకురాను. మీరంతగా పట్టుదలగావుంటే ఈవూళ్లో ఆడవాళ్ల క్లబ్బు ఒకటి స్థాపించడానికి ప్రయత్నించండి. ఆదికాలంనుంచీ మనహిందూవనితలకి మానమే ప్రాణంగా వుంటోంది. అందుకే మనదేశం పాతివ్రత్యానికి పేరుపోయింది. మనపూర్వులు ఎంతో కష్టపడి ఆర్జించిన ఆ చిరతర కీర్తిని క్షణంలో మనం పాడుచేయడమా! నేను మగవాళ్ల క్లబ్బుకు రాను. ఆవిషయంలో నన్ను బాధించకండి. మీస్నేహితులకు బోధించి వారిభార్యల నేడిపించకండి." అంది ఖండితంగా.

"సరే, చాలించు నీ వ్యాఖ్యానం. నీయిష్టమా, నాయిష్టమా, వారంరోజులలో నీవు నీపిచ్చివ్రాతలన్నీ, ఆచారాలనీ నీమనస్సులోనుంచి త్రోసి క్లబ్బుకు రావాలి. లేకపోతే నీకూనాకూ చాలాగ్రంథం జరుగుతుంది." అంటూ కోపంతో చివాలున లేచి వెళ్లిపోయాడు రామారావు.

పాపం సీత ఏంచేస్తుంది!! తనకు మగవాళ్ల క్లబ్బుకు వెళ్లడం యిష్టంలేదు. ఆవూళ్లో ఆడవాళ్ల క్లబ్బులేదు. ఇదివరలో తనకు చదువురాదనీ, ముఖ్యంగా ఇంగ్లీషు రాదనీ చాలాగ్రంథం జరిపితే ఎల్లాగో కష్టపడి మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసయింది. తనతో షికారు రమ్మంటే యిష్టంలేకపోయినా అలవాటు చేసుకుంటూంది.

అప్పుడింతకన్నా యిష్టంలేనిపని ఎలాగా అని విచారిస్తూనే ఈజీచైరులో పడుకుని నిద్రపోయింది.

* * *

రామారావు లండన్‌లో బారిష్టరు పరీక్ష ప్యాసయి స్వదేశానికివచ్చి బల్లకట్టాడు. అతడు అక్కడవున్న మూడుసంవత్సరాల్లో మనస్సుకు నాటినది అక్కడి

స్త్రీల ప్రవర్తన. కాంచనది శ్వేతముఖుల "షేక్ హాండ్". నిరంతర సావాసం ఆ దొరసానులతో అవడంవల్ల ఆతని కిచ్చటి స్త్రీలప్రవర్తన వేషభాషలు ఎక్కువగా చిరాకు కలిగించేవి. ముఖ్యంగా తన భార్యవిషయంలో ఆతను తనదేశంలో స్త్రీలకుకూడా "సమానహక్కులు" వుండాలనీ, తెప్పించాలనీ నిశ్చయించుకున్నాడు. అచట ప్రతివిషయంలో స్త్రీపుం దశం ఇచట పరిబాలవెనుక స్త్రీపుందశం ఆతనికి చాలా అసాధువుగా తోచింది. ప్రస్తుతం ఒకసంఘం స్థాపించాడు. దానికి తొమ్మండుగురే సభ్యులయినప్పటికీ వారందరూ రామారావు ప్రాణస్నేహితులే!! వారందరూ రామారావుచెప్పినట్లు వినేవారే!! ఆసంఘంలో స్త్రీలకుకూడా హక్కు లివ్వాలనీ, వారినికూడా క్లబ్బులో సభ్యురాండ్రుగా చేర్పించాలనీ ఓ తీర్మానాన్ని బలపరచి వెల్లడిచేశారు. కాని క్లబ్బుకు రాసాహసించే స్త్రీలెవరూ లేకపోయారు. రామారావు ఓ ఆలోచన చేశాడు.

ముందట మెంబర్లంతా తమభార్యలను క్లబ్బుకు తీసుకురావాలనీ అప్పుడు గాని, ఇతర స్త్రీలలో చురుకూ, వుత్సాహం పుట్టదనీ హెచ్చరించాడు. ఆపని ఎవరికీ మనసులో యిష్టంలేకపోయినప్పటికీ నవీననాగరికతకు లోటువస్తుందనే వుద్దేశ్యంతో, వారివారి భార్యలను క్లబ్బుకు రమ్మని బోధిస్తున్నారు. కాని వారందరూ ఆవిషయంలో సీతకు సోదరీమణులే అయ్యారు. ఊళ్లో ఎక్కడచూసినా రామారావుని గురించే వింతగా చెప్పుకుంటున్నారు. పాపం, సీతకిదంతా తలకొట్టినట్లుగావుంది. భర్తకోర్కె నీడేర్చి పూర్వసాంప్రదాయాన్ని, గౌరవాన్ని పాడుచేయడమూ — లేక స్వార్థపరత్వం కొరకు భర్తకు వ్యతిరేకించడమూ — అనేసాడు తీర్మానాలూ ఆమెమనస్సుని ఆందోళనపూరితం చేసేసాయి. తనస్థితిలోనే మిగతా మెంబర్ల భార్యలంతా వుంటారని తలచి వాళ్లసలహా తీసుకుని ఏదో వకటి నిశ్చయంచేసికొంటే నలుగురితోపాటవవచ్చునని సమాధాన పడింది.

౨

రుక్మిణి, డాక్టరు క్రిష్ణారావుభార్య: మంచితెలివి, చురుకూ గలది. కాపరానికొచ్చి రెండేళ్లయింది. తెనుగు బాగా చదివింది; కొద్దిగా ఆంగ్లంలో ప్రవేశం కలుగుతోంది. క్రిష్ణారావు మూడేళ్లనుంచి ప్రాక్టీసు చేస్తున్నాడు. రామారావుకు బాల్యస్నేహితుడు. తల్లి తండ్రీ దగ్గరే వున్నారు. ఒక్కడే కొడుకవడంవల్ల చిన్నప్పటినుంచీ, గారాబం పట్టుదలా ఎక్కువ.

ఆతనుకూడా క్లబ్బులో సభ్యు డవడంవల్ల రుక్మిణీని క్లబ్బుకు రమ్మని నయానా భయానా బలవంత పెడుతున్నాడు. రుక్మిణి తనస్థితి అత్త మామలతో చెప్పి వారిచే మందలింప చేయాలనుకుంది.

ఒకరోజున క్రిష్ణారావు భోజనంచేస్తున్నాడు. తల్లి వడ్డిస్తూ 'ఏంరా, బాబూ, ఏమిటీగోల—ఊళ్లోఅంతా అల్లరిగావుంది!! ఆ రామారావుకు పిచ్చాయేమిటి? స్త్రీలకు హక్కులివ్వడం ఏమిటి? మగవాళ్లతో సమానంగా తిరగడం ఏమిటి? ఏమిఘోరం వచ్చిందిరా బాబూ; మాకాలంలో యిల్లాంటివెరుగుదుమా? పరువుమర్యాదా అక్కరలేదుట్రా? ఏమో; మీవేషాలేం బాగుండలేదబ్బాయి.' అంది

"అందులో తప్పేముంది చూడు. పెద్దపెద్ద వూళ్లల్లో అందరూ వెళ్లటంలేదూ? వాళ్లందరూ పాడైపోతున్నారా? ఇంట్లోవున్నవారేనా పతివ్రతలు!!" అన్నాడు క్రిష్ణరావు.

"చూడు! డిస్ట్రిక్టలెక్టరుగారమ్మాయి మొగాళ్లతో చదువుకుంటోందిట. ఆ అమ్మాయి నెలా చెప్పుకుంటున్నారు. మనలని అలాగే చెప్పుకుంటారు. చెడ్డపేరు తెచ్చుకోవడం ఎంతసేపు. ఫలాని ఆతని భార్య అలా ఇలా అని చెప్పుకుంటారు." అంది తల్లి.

"ఆ అమ్మాయి చదువుకోసం అన్నీ భరిస్తుంది. క్రొత్తలో చెప్పుకుంటారు. తరువాత అందరూ మొదలుపెడితే అదీ ఒక ఆచారమే అయిపోతుంది.

చదువురాకపోతే నీలాగూ నీ కోడలులాగూ ప్రపంచ సంగతులేవీ తెలియకుండా మూర్ఖపు ఆచారాల పిచ్చితో, కూపస్థమండూకాల్లా ఇంట్లో పడివుంటారు. మనది పాడుసంఘం — నాకు మజ్జిగపోయ్యి. నాయిష్టం నేను క్లబ్బుకు తీసుకువెడతాను. నాయిష్టంవచ్చినట్లు చేస్తా. నీవురావ్యాదా దక్కించుకో'' అన్నాడు.

పాపం దుర్గమ్మగారు మళ్లా మాట్లాడలేదు. క్రిష్ణారావుకు చాలాకోపం వచ్చింది. చెయ్యికడుక్కొని మేడమీదికి వెళ్లిపోయినాడు. ఇదంతా రుక్మిణే చేసిందని భావించి ఆమెమీద కోపగిల్లాడు. ఆమెకు తగినశిక్ష విధించాలనుకుంటూ పడుకుని నిద్రపోయినాడు.

రుక్మిణి భోజనంచేసి గదిలోకి వచ్చేసరికి క్రిష్ణారావు నిద్రపోతున్నాడు. పళ్లెంలో తానుపెట్టిన తమలపాకుచిలకలూ, చెక్కపొడీ అలాగే వుండిపోయాయి. సంగతంతా గ్రహించింది. ప్రక్కగదిలోకి వెళ్లి పాటలుపాడుకుంటూ రాట్నం త్రిప్పుతూంది. కాని ఆమెమనస్సు మనసులో లేదు. దారం తీస్తూందన్న మాటేగాని అది పూర్వపు సున్నితాన్ని కోల్పోయింది. పురిఎక్కినదారం వెంటనే కదురుకు చుట్టక పరధ్యానంతో ఎక్కువ త్రిప్పడంవల్ల అనుక్షణం దారం పుటుక్కు పుటుక్కు తెగిపోతోంది !! ఆమెకు ప్రతిదినం దారంతీయడం ఎంతవుత్సాహంగా వుండేదో ఆ దినం అంతకు రెట్టింపు విసుగ్గా వుందామెకు. “రుక్మిణీ నీసున్నితపు చేతుల్తో తీసిన దారం నీలాగే మృదువుగా వుంటూందిసుమా;” అని అంటూండేవాడు క్రిష్ణారావు తరుచుగా.

రుక్మిణి తండ్రి కాంగ్రెసునాయకుడవడంవల్ల ఆమెకు చిన్నతనాన్నుంచీ ఖద్దరూ, స్వదేశీవస్తువులూ అంటే ఎక్కువయిష్టం. ఆమె నిరంతర ఖద్దరువస్త్రధారిణి. ఆమె సాధ్యమైనంతవరకూ దేశీయవస్తువులనే వుపయోగించేది. కన్నులు మిరుమిట్లుకొల్పే వింతవింత రంగుల్తో, వింత మెరుగుల్తో, ఎన్నిరకాల విదేశీయ గాజులు వచ్చినా, ఆమె నల్లని కాశపూస్త్రిగాజులనూ తెల్లని దంతపుగాజుల్నే ధరిస్తుందిగాని ఎన్నడూ వ్యామోహపడదు.

ఆమె తన చిన్ననాటి సంగతులనూ, ఈ రెండు సంవత్సరాల్నుంచీ అనుభవిస్తున్న తనభర్త అవ్యాజానురాగాన్నీ తలచుకుంటుండగానే శ్యామలవచ్చి “వదినా! టీనీళ్లుకాగాయట: అమ్మ రమ్మంటూంది.” అంది. వెంటనే రుక్మిణి టీ తయారు చేయడానికి క్రిందకు వెళ్లింది. అల్లా వెళ్లిందో లేదో క్రిష్ణారావు చివాలునలేచి ముఖం కడుక్కొని డ్రస్సు వేసుకుని వీధిలోకి వెళ్లిపోయాడు. ఒక అరగంటకు వెండిపళ్లెంతో వేడి పకోడీలూ, గ్లాసుతో మంచినీళ్లూ, టీ పట్టుకు వచ్చింది రుక్మిణి. కాని అక్కడ ఎవరూలేనిదే!! గదిలోకి వెళ్లిచూచింది. అక్కడ బట్టలులేవు. ఆమెకు పిడుగు నెత్తిమీద పడినట్లయింది. అవన్నీ డ్రాయరుమీద పడేసి కళ్లనీళ్లతో మంచంమీద కూలబడిపోయింది.

3

సాయంకాలం నాలుగుగంటలయ్యింది. డా॥ క్రిష్ణారావుగారింటి దగ్గర కా రాగింది. సీతాదేవి కారుదిగి చరచర లోపలికివెళ్లి “రుక్మిణీ” అని పిలిచింది. కాని రుక్మిణి మరదలు శ్యామల ఎదురొచ్చింది. “మీవదిన యేదీ? అన్నగారింట్లోవున్నారా? అమ్మగారేదీ?” అని ప్రశ్నపరంపర కురిపించింది. శ్యామల పదేళ్ల పిల్ల. కడసారపుపిల్ల అవడంచేత గారవం ఎక్కువ. శ్యామల సీతను అక్క అనీ రామారావుని బావ అనీ పిలుస్తుంది. “అక్కా; మరేం అన్నయ్యకి వదిన క్లబ్బుకు రాలేదని కోపంవచ్చి మరేం మధ్యాహ్నం అన్నం సరిగా తినలేదు. వదినతో దెబ్బలాడాడు. మరి “టీ” కూడా త్రాగకుండా ఎవరితో చెప్పకుండా ఎక్కడకో వెళ్లి పోయాడు. వదిన యేడ్చి మేడమీద పడుక్కుంది. అమ్మ పడమటింట్లో పడుకుంది. రా! మనం మేడమీదికి వెడదాం” అంది. ఈ మాట

విశేషర్కా— సీతముఖం కాంతివిహీనమై వెలవెల బోయింది. నోటమాట రాలేదు. ఆమె ఆ యింటికి దొంగలా అయిపోయినట్లయింది. తప్పుపనిచేసిన స్త్రీలా ఆమె సిగ్గుతో తలవంచుకొని మౌనంగా శ్యామల వెనక మేడ మీదికి వెళ్లింది. కాని ఎప్పటిలా రుక్మిణి ఎదటికి చొరవగా వెళ్లడాన్కి—కాని, పదివాతంటూ వేళా కోళాలు చేయడాన్కి—కాని ఆవిడకు సాహసం కలగలేదు.

తాను హాల్లో కుర్చీలోకూర్చుని శ్యామలచేత రుక్మిణికి తనువచ్చినట్లు కబురంపింది. వెంటనే రుక్మిణి ముఖంతుడుచుకుంటూ తనబాధ నామెకు తెలియకుండా చేయడానికి లేని చిరునవ్వు తెచ్చుకుంటూ "సీతా" అంటూవచ్చింది. కాని రుక్మిణి కళ్లువాచి ఎర్రగా జ్యోతులల్లావున్నాయి. పచ్చనిచాయతో కళలుకక్కే ఆమెముఖం ఎర్రబారి వికాసహీనంగా ఆమెను చూడగానే సీత సంగతంతా గ్రహించినది. ఆమెకన్నా తానే ఒకవిధంగా ధైర్యవంతురాలనని తలచి మరికొంతధైర్యంతో "ఏమిటీవరస!! అలా వున్నావేం?" అంటూ ఏమీఎరుగనట్టుగా అడిగింది.

"సీతా! తల్లిపుట్టిల్లు మేనమామ యెరగడట! అలా వుంది. అన్నగారి యున్న తాళయాల్ని నేనుభరిస్తూన్నప్పుడు మాఅన్నగారి అర్థశరీరానివైన నువ్వు తెలియనిదానిలా నటిస్తావెందుకూ?" అంది. రుక్మిణి చమత్కారభాషిణి.

"సరే! దానికేంలే. ఆవిషయంలో నీవుద్దేశ్యం ఏమిటి? ఏదో ఒక గట్టిపుపాయంచేసి వీరి సందర్భశూన్యంఅయిన ఈపాశ్చాత్య నాగరికతా వ్యామోహ భవనాన్ని పడగొట్టి మనమే మన ఆచారాలకి సరిపోయేటట్లు ఒక దిట్టమైన నూతనభవనాన్ని నిర్మించుకోవాలి. అధైర్యపడితే ఏమీ లాభంలేదు."

"అయితే సీతా ఏమంటావు. క్లబ్బుకి వెళ్లడమా నీవుద్దేశ్యం!! చూడు మనదేశంలో స్త్రీలంటే ఎంత పూజ్యభావమో! ఎంతగౌరవమో! మనం పురుషుల క్లబ్బులోకి వెళ్లామంటే మనం వారితో సమంగాచేయి కలిపి తిరిగామంటే యింక స్త్రీ అనేదిఇంక యేమేనా వున్నదా? ఉత్సవదినాల్లో మేళంచేసే భోగంవాళ్లకీ మనకీ యిక తారతమ్యం యేముంది? వారెంత గౌరవింపబడుతున్నారో మనంకూడా అంతే పూజింపబడుతాం. ఇక కులాంగన అనే పదానికి చోటేది. అందుకనే వారుకూడా వారి మేళతాళాలు, వారి వృత్తిమాని వివాహాలుచేసుకుని కులాంగన అనే పదానికి అర్హత సంపాదించడానికి పాటుపడుతున్నారు. అదికాకుండా అన్నగారి ఉన్న తాళయాల్ని చెడ్డనడుటను, వింతలనుటకు వీలులేదు. ఎందుచేతనంటావా—చూడు—ఇప్పుడు మహాపండితులంతాకలసి "స్త్రీలు, నాట్యరంగం త్రొక్కాలి. అప్పుడుగాని నాట్యకళ, నాటకంలోని రసికత ఉద్ధరింపబడ"దని ఒక వెర్రి పూహను పైకివెలిబుచ్చి దానిని ఆచరణలోకి తీసుకురాప్రయత్నిస్తున్నారు."

సీత "ఓహో! సరే. దానికన్నా యిదేబాగు. ఇది అంటే యింకా మగవారితో సమానంగా వారిక్లబ్బుకు పోవడం, వారితో సమానంగా విషయాలు చర్చించడమూ, సరదాగా ఆటలూ పాటలూగాని—రుక్మిణీ! దీనికే మనం,—నీవు నీముఖం, కళ్ళూ కందిపోయేటట్టు విచారించడం, నేను తలక్రిందుగా ఆలోచించడం చేస్తున్నాం. ఇంకా మనలాటివారు ఎంత గాభరా పడుతున్నారో. మరి ఆనాటకాల్లో పాత్రలుధరించి నటించడం ఎలాగో! అతి హేయంకాదా! రుక్మిణీ! అబ్బా! తలచుకుంటే వళ్లు జలదరిస్తోంది!! కులస్త్రీలందరూ నాట్యరంగప్రవేశ మవుతుంటే, యింక వ్యభిచార నిర్మూలనచట్టం అమలులోకితెచ్చి ఆ వేశ్యాకులాన్ని బాధించడంఎందుకూ. ఇంకా దేవునిదయవల్ల మాఅన్నగారి తలలో ఈతలపింకా ప్రవేశించలేదు. అయినా మన మగవారికి వివేకజ్ఞానం నశిస్తూంది. నలుగురొకచోట చేరడం. ఆకారసానుల ప్రవర్తనాన్ని జపించడం, ఏదో ఒక పిచ్చిపూహని

సిద్ధాంతంచేసుకోవడం, ఇకయింటికివచ్చి—వున్నారుగా లోకువ అయినభార్య, అజ్ఞానులు, అమాయికులూ అయిన బిడ్డలూ వారిని బాధించడం, వారి తీర్మానం ప్రకారం నడుచుకోమని.

రుక్మిణి:—సరే! దానికి నిదర్శనం మనమే. కాని యింత మంచి, చెడ్డ, యుక్తాయుక్త విచక్షణ లేక వారు చెప్పారే అనుకో. మనకేనావుండొద్దూ—భారత స్త్రీ పరపురుషుని కన్నెత్తి చూడదనీ స్పృశించదనే చిరతరకీర్తిని నేడు మనం పమ్మ చేయడమేనా !!

సీత:—అయితే నాల్గుగోడలమధ్యా, అవీ చాలక పరదాలుకూడా వేసుకుని పడివుండడమేనా! ఇక నేరం చేసి ఖయిదుననుభవించే ఖయిదీకన్నా, పశువుకన్నా మనలో రెుక్కువ ఏముంది? అల్లాపడి లోకజ్ఞానం లేకుండా వుండడమేనా!!

రుక్మిణి:—అదిగో, మాఅన్నగారిగాలి నీకు చాలా తగిలిందే!! మరి అర్థాంగివి కాదూ, అలా అంటావో అనవో అనే అనుకుంటున్నా, మరి ఏమిటిసాధనం?

సీత:—అల్లా దారికిరా మనంమాత్రం చేతకాని వారమా, వారు పురుషులక్లబ్బు స్థాపించుకుంటే, మనం స్త్రీలకు క్లబ్బు స్థాపించుకుందాం. ప్రస్తుతం మాయింట్లో ఖాళీగావున్న హాలువుంది. మాకు ఆంధ్ర పత్రిక, భారతి, గృహలక్ష్మి, హిందూసుందరి, **Hindu** పేపరూ వస్తాయి. ముందు విఘ్నేశ్వరపూజ కావిస్తే తరువాత మెల్లిగా నువ్వూనేనూ తంటాలు పడదాం. ఏమంటావు?

రుక్మిణి:—ఓ అల్లాగే కాని పిరి నీ వూహనుంచి మరలించాలి. చెప్పినంతమాత్రాన్ని వినేదిలేదు. మధ్యాహ్నం అత్తగారు చెప్పారనేగా భోజనంచేయక, టీ పుచ్చుకోక, మాటాడక వెళ్లారు !!

సీత:—నేను దానికే తగిన ఎత్తువేశాను. దీని కంతకూ కారకులు మాఅన్నగారు. కనుక వారిమనస్సు త్రిప్పితే అందరూ దారికి వారేవస్తారు. ఆసాప్రయత్నానికి నువ్వే సాయపడాలి. అందుకనే వచ్చాను.

రుక్మిణి:—ఏమిటది ?

సీత:—ఇలారా, (చెవిలోచెప్పును) రుక్మిణి పకపకానవ్వడం మొదలుపెట్టింది. సీత—అబ్బా! ఇప్పుడు కాదు నవ్వడం. వారికి పశ్చాత్తాపం కలిగినప్పుడు, మనప్రయత్నం సార్థకమయినప్పుడు, మన కుల్లాసం. రేపు తప్పకుండా మరువకుసుమా. పిన్నిగారి దర్శనంకూడా చేశివడతా. నువ్వూ వస్తావా ?

ఇద్దరూకలసి పడమటింట్లోకి వెళ్లారు. దుర్గమ్మగారు సీతనుచూసి హేళనగా "ఓహో దొరసానులు కాబోలు. ఇలా దయచెయ్యండి. అంతా కుశలమా?" అన్నది.

సీత:—పిన్నిగారూ! ఇంకా అవందే వేళాకోళం రెుందుకూ!! నేనయితే మీకోడలుమాత్రం అవకుండా వుంటుందేమిటి? అని జవాబిచ్చింది. దుర్గమ్మగారి హుషారు కొంచం తగ్గింది.

"అయితే అమ్మాయీ, ఏమిటిదంతా? నాకేమీ పాలుపోవడంలేదు."

సీత:—పిన్నిగారూ, తప్పంతామీది. మీది అంటే "మీది" కాదులెండి. మనహిందూజాతి తల్లిదండ్రులది. ఎందుచేత నంటారా ? బాలురకు చదువురావాలనీ, పెద్దపుద్యోగాలు చెయ్యాలనీ, వారిని చిన్నప్పుడే—అంటే—జ్ఞానం రాకముసుపే, స్వదేశం యందు దృష్టిపారకముందే తనజాతి సంఘంఅంటే అర్థం తెలియకముందే ధనాతురులై పూర్తిగా మన దేశాచారాలకి, విరుద్ధమైన పరదేశాలకు పంపుతారు. అదీకాకుండా వారికి చిన్నప్పుడే వారి ఎత్తుధనం కట్నం ఆశేపేర పుచ్చుకుని ఒక పసికూనను కట్టిపెట్టేస్తారు. అక్కడ ఆపిల్లవాడు తెల్లనికాగితంలా నిష్కల్మషమైన తన హృదయంలో అచటి ఆచారప్రవర్తనలను నాటింపజేసుకొని వానికే కేవలం అలవడిపోయి, చిన్ననాటి తనదేశాన్నీ, తనమతాన్నీ సంఘాన్నీ పూర్తిగా మరిచిపోతాడు. ఇక్కడ ఈపిల్ల పూర్తిగా తనదేశాచారాన్నీ వచ్చీరాని

చదువునీ బాగా అభ్యసిస్తుంది. వీరిద్దరూ కలసి కాపురం చేస్తున్నప్పుడు కేవలం పురుషులవంటి స్త్రీలలో మెలగిన ఆయువకునికి తన స్త్రీ అంటే అసహ్యం కలుగదా? అప్పుడతను ఆమెతో కాపురం చేయడానికిష్టపడక అనుదినం దెబ్బలాటలతో గడపడమో, లేక అసలా యమాయికురాల్ని విసర్జించడమో జరుగుతుంది. అలా మనం ఎన్ని వినటంలేదూ? అలా విసర్జించబడినబాలికకు ఏమాత్రం మన సంఘసహాయం, సానుభూతి లేదుగదా!

దుర్గాంబ:—అబ్బా! ఏమిటే! జాణవైపోతున్నావు. మొన్నటిపల్లెటూరి సీతవుకాదూ నువ్వు! గుక్కతిప్పకుండా లెక్చరిస్తున్నావు!! అయితే ఈగొడవకు నీవేమంటావు?

సీత:—వినండి. పిన్నిగారూ! మీఅల్లుడుగారివల్ల స్వయంగా నే నిన్నికష్టాలూ అనుభవించాను. ఇప్పుడు ఈక్షణంలో అనుభవిస్తున్నాను. కాని యిలాంటివి నాకు పరిపాటే. దీని పర్యవసానం మీరు రేపో, ఎల్లుండో వినగలరు. ఐదుగంటలు దాటింది. ఇక నేను వెడతా, వా రింటికివచ్చే వేళయింది. రేపు వదినతో సారి మాయింటికి పంపుదురూ! రుక్మిణీ! నే వెడతా, నేచెప్పినమాట మరవకు, సెలవు. అంటూ కారెక్కింది.

౪

మర్నాడు సాయంకాలం 6 గంటలయింది. రామారావూ క్రిష్టారావూ క్లబ్బులో "స్త్రీక్లబ్బు ప్రవేశాన్నిగురించి తీవ్రంగాచర్చించి ఉపన్యసించి ఆమరునాడు కరపత్రాలు పంచిపెట్టటానికి తీర్మానించుకుని మామూలుగా రామారావింటికి వచ్చారు. రోజూ వేసివుండే వీధితలుపు దగ్గరగా తీసివుంది. తలుపుతీసుకుని లోపలికి వెళ్లారు. హాల్లోదీపం సన్నగా వెలుగుతూవుంది. హాల్లో ఎవరూ లేరు. రామారావాశ్చర్యపోతూ క్రిష్టారావుతో మేడఎక్కాడు. గదితలుపుతీసివుంది. దీపం ఎక్కువగా వెలుగుతూవుంది. క్రిష్టారావుని హాల్లోకూర్చోమని డ్రస్సు తీయడానికి గదివేపు వెళ్లాడు. తలుపుసందులోంచి సీత ఎవరో యువకునితో చదరంగ మాటాడుతూ కనబడింది. టేబిల్ మీద టీ, ఫలహారాల సరంజామావుంది. రామారావాసందులోంచి నిశ్శబ్దంగా తొంగిచూచాడు. ఆక్రొత్తయువకుడు చిరునవ్వుతో సీత మృదులహస్తాన్ని ముద్దుపెట్టుకొంటూంటే సీతకూడా మందహాస వదనారవిందఅయింది. ఈదృశ్యంచూసేసరికి రామారావు హృదయం కోపం, అనుమానం, ఈర్ష్యలతో ఒక్కసారిగా మండిపోయింది. వచ్చీరాని అస్పష్టమైనమాటలతో "ఆఁ సీతా! ఆగు!" అని పెద్దకేక వేసి తలుపు బార్లాతీశాడు. సీత ఉలికిపడిలేచి వెలవెలబోయిన ముఖంతో సిగ్గు అవమానంతో తలవంచుకుని దూరంగా తప్పుకుంది. రామారావు కోపంతో గజగజా వణికిపోతున్నాడు.

ఈగడబిడఅంతా చూస్తున్న క్రిష్టారావు అక్కడకు వచ్చి "సీతా! ఏమిటీపని! తప్పుకాదా? అన్నాడు.

రామారావు కోపంతో "అందుకే మనకవులూ పెద్దలూ స్త్రీలహృదయాన్ని నారికేళపాకంతో వర్ణించారు" అన్నాడు.

"వారు దూరదృష్టి కలవారు" అన్నాడు డాక్టరుగారు.

సీత చిరునవ్వుతో "నేనేమి పాడుపనిచేశాను. సోదరునివంటివానితో చదరంగం ఆడటం పాడుపనా? ఈ మాత్రం సహించలేనివారు పురుషులక్లబ్బులో స్త్రీలను మెంబర్లుగా చేయడానికి ఏమనసుతో తీర్మానించారు. నేనక్కడ క్లబ్బులో పరపురుషునితో పేకాడుతుంటే, చేయిచేయి కలపి కబుర్లు చెప్పుతూంటే మీ రక్కడ వున్మత్తులై పోరూ? అందుకే మనపూర్వులు దూరదృష్టితో ముందురాబోయే పురుషులు సహనం, వివేకంలేనివారవుతా రని గ్రహించి స్త్రీలస్వేచ్ఛను మోతాదుగా వుంచారు."

రామారావుకోపం ఆగటంలేదు. "ఛీ! ఏ మొగం పెట్టుకొని మాట్లాడుతున్నావు? క్లబ్బుకు రమ్మంటే ఏవో వేదాంతా లుపదేసించావే!! పతివ్రతలా కబుర్లు చెప్పావే!! దూరదృష్టితో ఆలోచించమన్నావే!! స్త్రీలు తేనెపూసిన విషపుకత్తులని వూరికేఅన్నారూ!!

సీత:—కోపం ఎందుకూ!! మీరేమన్నారు — స్త్రీ స్వేచ్ఛ స్త్రీయిష్టంమీదనే వుండాలన్నారు. అందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈమాత్రానికే వున్మాదులై పోయారు. సహనం కోల్పోయారు. నా ప్రవర్తనలో మీరు తప్పేమి కనిపెట్టారు? అతడు నా సోదరుడు. నేనాతనితో సోదరబుద్ధితో చదరంగమాడుతున్నా!! ఆతడూ నేనూ చిన్నప్పుడు చదువుకుని ఆటలాడుకునేవాళ్లం. ఆతని నింతఅవమానం చేయడం బాగుందా! రేపు క్లబ్బులోనూ, ఈవిధంగానే గంతులు వేస్తారా నలుగురిలో.

రామారావు:—ఛీ! నిన్నింకా ఈయింట్లో వుండనిస్తానా. శీలంలేనిదాన్కి యిల్లెందుకు? అన్నీ యింట్లే. అవతలికిపో!! నీవొకనిభార్యవా? అంటూ ఆమెను గదిలోనుంచి అవతలికి తోయబోతుంటే ఆ నవీనయువకుడు "ఆగు! ఆమెను త్రోయకు అంటూ దగ్గరకు వెళ్లి ఆమెను విడిపించపోయాడు. ఈసారి రామారావుకి మరీకోపంవచ్చింది. ఇక ఆగలేక ఆపురుషుని మీదికి దుముకపోయేసరికి ఆగండి! పరస్త్రీ నంటకండి అని చెప్పగా ఆయువకుడు తప్పించుకుని దూరంపోయి తన కోటూ, తలపాగా తీసివేసాడు చిరునవ్వుతో. ఆశ్చర్యం!! పురుషుడుకాడు. క్రిష్ణారావు భార్య రుక్మిణి, స్నేహితులిద్దరూ ఆశ్చర్యం, సిగ్గుతో తల వంచుకున్నారు. పదినిమిషాలవరకూ అంతా మౌనవ్రతులే అయ్యారు. చివరకు సీత "శీలంలేనిది యిప్పుడే వెళ్లిపోతే ఉత్తమంకాదా ఆతిథిమన్న మీ పినతల్లిగారింటికి పోతాను. సెలవు "అంటూ రుక్మిణితో వెళ్లబోతుంటే రామారావు అడ్డువచ్చి "సీతా! నన్ను క్షమించవూ" అన్నాడు.

నేనా క్షమించేది. శీలంలేనిదాన్ని క్లబ్బుకు రానందుకు మీరే క్షమించాలే!! రేపు వస్తా క్లబ్బుకు క్షమించండి. నాకు సెలవు అంది సీత.

"సీతా! నన్నెందుకింకా వెక్కిరిస్తావు. ఇక క్లబ్బు ప్రస్తావన నాదగ్గర లేదు. నాకు బాగా బుద్ధి చెప్పి, నామర్యాదయే నిలబెట్టావు నిన్నుచాలా బాధపెట్టాను; నీవు నిజంగా సీతవే అన్నాడు పశ్చాత్తాపంతో రామారావు.

వెంటనే రుక్మిణి క్రిష్ణారావుతో "ఏమండీ డాక్టరుగారూ! రేపు నేను క్లబ్బుకురావచ్చునా" అంది.

క్రిష్ణారావు "రుక్మిణీ! అసలు నాకు మొదటినుంచీ యిష్టంలేదు. నలుగురితో నారాయణా అని ఒప్పుకున్నాగాని. రామారావూ! అసలీ రూలేమీ బాగాలేదు; ఇది తీసేద్దాం."

రామారావు "సరే" అన్నాడు నిస్పృహతో.

ఆవేళకు రుక్మిణీ కృష్ణులు, సీతా రామారావు యింట్లో విందు కూర్చున్నారు. రామక్రిష్ణు లిద్దరూ పరాభవం విచారంతోనూ, రుక్మిణీ సీత లిద్దరూ విజయసూచకం అయిన వుత్సాహంతోనూ భోజనాలు ముగించారు. తరువాత రుక్మిణీకృష్ణులు వారింటికి వెళ్లారు.

మర్నాడు సాయంకాలం క్లబ్బులో రామారావు, క్రిష్ణారావు ఆనందరావు మొదలైనవారంతా కూర్చుని ఎవరికిష్టమయిన కాలక్షేపం వారు చేస్తున్నారు. రామారావు క్రిష్ణారావుమాత్రం ఎందుకో నిరుత్సాహంగా వున్నారు. వారిద్దరూ ఎవరేనా స్త్రీలక్లబ్బు ప్రవేశాన్ని గురించి ప్రస్తావన తీసుకువస్తారేమో నని బిక్కుబిక్కుమంటున్నారు.

ఇంతట్లోకే వీధిలో బాజాచప్పుడయింది. పిల్లలందరూ పేపర్లకోసం పరుగెత్తుతున్నారు. క్లబ్బుప్యూను నరశింహం 2, 3 పేపర్లు పట్టుకువచ్చి సభ్యులకిచ్చాడు. ఆపేపరు చదువుతోగానే అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అది ఈవిధంగావుంది.

స్త్రీ సమాజము స్థాపింపబడును.

ఆదివారము 11-4-34

బారిష్టరు రామారావు పంతులుగారింట ఆదివారం నాడు స్త్రీలకు ప్రత్యేకంక్లబ్బు స్థాపింపబడును. ఆనాడే ఆర్. సీతాదేవిగారి యాధిపత్యమున ప్రారంభోత్సవమును జరపించి యిష్టమున్నవారు మెంబర్లుగా చేరవచ్చును.

ఇట్లు

ప్రెసిడెంటు — ఆర్. సీతాదేవి.

సెక్రెటరీ — యస్. రుక్మిణీదేవి.

రామక్రిష్ణు లిద్దరూ ఆ కాగితంచూసి ఆనందం పొందారో, పరాభవా న్ననుభవించారో వారికేఎరుక!